EDITORIAL సంపాదకీయం

# పేద కూలీల కడుపు కొడుతున్న మోడీ ప్రభుత్వం



- నుమాన్ మహమ్మద్,
ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్,
9908279090

గత 20 సంవత్సరాలుగా దేశంలోని గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఉపాధిని అందిస్తుంది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. మత్రేగా (MGNREGA) పేరుతో పేద కూలీల వలసలను నివారిస్తూ, కరువు సమయంలో వారి కడుపు నింపుతుంది. అలాంటి ఈ పథకం లక్ష్యం, రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయి. పేద కూలీలకు పని దినాలను పెంచుతున్నామని ప్రస్తుత ఏన్డీయే ప్రభుత్వం పైకి చెపుతున్నా, ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కనబడుతుంది. సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పాత చట్టం పేరుతో సహా పూర్తిగా మార్చిన, "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్" (వీబీజీరామ్జీ 2025) పేరుతో నూతన బిల్లు ప్రతులను లోకసభలో సభ్యులకు అందించారు.

2005లో నాటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. కరువు పరిస్థితులలో వ్యవసాయ కూలీల వలసలను నివారిస్తూ, వారికి తమ గ్రామంలోనే పని కల్పించడం ఈ పథకం లక్ష్యం. గత 20 ఏళ్లుగా పేద కూలీలకు ఇంత క్రియాశీలకంగా ఉపయోగపడ్డ పథకం మరొకటి లేదు. దీనికి నిదర్శనం ప్రస్తుతం దేశంలో దాదాపు 12 కోట్ల మందికి పైగా ఉపాధి హామీ కార్డును కలిగి ఉన్నారు. నాటి యూపీఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ ప్రత్యేక చొరవతో ఈ పథకం ప్రారంభమైంది. ఈ పథకం అమలు గురించి సోనియా గాంధీ నిరంతరం ఆరా తీసేవారు. ఈ పథకం పేదల కడుపు నింపుతుండడంతో 2009లో రెండవసారి అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం దీనికి జాతిపిత మహాత్మా గాంధీ పేరును పెట్టి మరింత బలోపేతం చేసింది. ఇంతటి ముఖ్యమైన ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుంచి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. గతంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ "ఇది గుంతలు తీసే పథకం" అని చులకనగా మాట్లాడారు.



పాత చట్టం ప్రకారం సంవత్సరానికి కనీసం 100 రోజులు వ్యవసాయ కూలీలకు పని కల్పించాలి. కొత్త చట్టం ప్రకారం ఈ పని దినాలను 125 రోజులకు పెంచారు. మరోవైపు సెక్షన్ 5 ప్రకారం వ్యవసాయ పనుల రద్దీ సీజన్లో ఈ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కచ్చితంగా 60 రోజుల సెలవు ఇవ్వాలనే నిబంధనను చేర్చారు. ఒకవైపు పని దినాలను 25 రోజులు పెంచుతూనే, మరోవైపు కచ్చితంగా 60 రోజుల సెలవులు పేద కూలీలకు ఇవ్వడం ఏమిటి ? ఇది భూస్వాములకు చవకగా కూలీలు దొరకడం కోసం చేస్తున్న కుటిల ప్రయత్నం ం కాదా ?

పాత చట్టం ప్రకారం ఈ పథకానికి అయ్యే ఖర్చు కేంద్ర ప్రభుత్వం 90 శాతం భరించేది. కానీ నూతన చట్టం ప్రకారం 60 శాతం మాత్రమే భరిస్తుంది. మిగతా 40 శాతం రాష్ట్రాలు భరించాలి. అంటే ఈ పథకానికి ఇచ్చే నిధులను కేంద్రం తగ్గించుకుంటుంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక భారాన్ని పెంచుతుంది. అంతేకాదు కేంద్రం ఆయా రాష్ట్రాలకు కొన్ని పారామితుల ద్వారా నిధులను కేటాయిస్తుంది. కేటాయించిన నిధులకు మించి పనులు జరుగుతే, ఆ అదనపు ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి. ప్రస్తుతం దేశంలో అనేక రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. జీఎస్టీ రూపంలో రాష్ట్రాల నుంచి వసూలు చేసిన పన్నులను, తిరిగి రాష్ట్రాల వాటా కింద ఇచ్చే నిధులను కేంద్ర ప్రభుత్వము పెండింగ్ లో పెడుతుంది. ఇలాంటి సందర్భంలో ఈ పథకం కింద ఇచ్చే నిధులలో కేంద్రం తగ్గించుకోవడం సరిఅయినది కాదు. ఇదేనా పేద కూలీల మీద కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ? ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాలను మరింత సంక్షోభంలో నెట్టడమే వికసిత భారత్ లక్ష్యమా ?

పాత చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధులను కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. ఉదాహరణకు గత నాలుగేళ్లుగా పశ్చిమబెంగాల్లో ఈ పథకం కింద పనిచేసిన కూలీలకు ఇచ్చే వేతనాలు రూ. 3 వేల కోట్లకు పైగా బకాయిలను కేంద్రం విడుదల చేయకుండా జాప్యం చేస్తుంది. దీనిని నిరసిస్తూ "పశ్చిమ్ బంగా ఖేత్ మజ్దూర్ సమితి" కలకత్తా హైకోర్టుకు వెళ్ళింది. హైకోర్టు ఈ నిధులను విడుదల చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. హైకోర్టు తీర్పును నిరసిస్తూ కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత అక్టోబర్ నెలలో సుప్రీంకోర్టు కూడా ఈ నిధులను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇదీ కేంద్ర ప్రభుత్వానికి ఈ పథకం అమలుపై ఉన్న చిత్తశుద్ధి. పాత చట్టం ప్రకారం ఏయే గ్రామీణ ప్రాంతాలలో, ఎలాంటి పనులు చేయించాలనేది రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించేవి. కానీ కొత్త చట్టం సెక్షన్ 5 ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వ జోక్యం రాష్ట్రాలపై పెరుగుతుంది. నూతన చట్టం ప్రకారం పనులు ముగిసిన 15 రోజులలో కూలీలకు వేతనాలు చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదల జాప్యం చేస్తే ఈ భారం మొత్తం రాష్ట్రాల మీద పడుతుంది.

గత 8 ఏళ్లుగా ఈ పథకం కింద పనిచేస్తున్న కూలీల వేతనాలను పెంచడానికి మోడీ ప్రభుత్వానికి మనసు రావడం లేదు. 2024 దేశ సాధారణ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఈ పథకం కూలీలకు ప్రస్తుతం ఇస్తున్న ఒక రోజు వేతనం రూ. 370 రూపాయలను రూ.400కు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ పథకం కింద మరింత ఎక్కువ మంది కూలీలకు పని కల్పిస్తామని భరోసా ఇచ్చింది. సోనియా గాంధీ పేదలకు కడుపు నింపాలని ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడమే ప్రస్తుతం మోడీ ప్రభుత్వం ఉద్దేశం. దీనికి ఒకే ఒక్క కారణం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఈ పథకానికి మంచి పేరు ఉండడమే. ఈ పథకం నిర్వీర్యం అయితే పేద కూలీల చేతులకు పని దొరకడం కష్టంగా మారుతుంది. పేదలు మళ్లీ ఆకలితో అలమటించే రోజులు వస్తాయి. దీంతో వలసలు మరింత పెరుగుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతుంది. కావున ప్రజాస్వామికవాదులు, పేదల పక్షపాతులు ఈ నూతన చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేసే పోరాటాలలో భాగస్వామ్యం కావాలి.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999



## పాకిస్థాన్‌ను దెబ్బకొట్టిన తాలిబన్లు





పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా సింధూ జలాలను భారత్ పరిమితం చేయడంతో దాయాది పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో అఫ్గనిస్థాన్ పులిమీద పుట్రలా మరో సంచలన నిర్ణయం తీసుకుని షాకిచ్చింది. ఇరు దేశాలకు ప్రధాన నీటి వనరుగా ఉన్న కునార్ నది నీటిని మళ్లించే ప్రాజెక్ట్‌కు తాలిబన్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టైమ్స్ నివేదిక ప్రకారం.. అఫ్గన్ ప్రధానమంత్రి కార్యాలయం ఆర్థిక కమిషన్ సాంకేతిక కమిటీ సమావేశంలో కునార్ నది నుంచి నంగర్‌హార్‌లోని దారుంతా డ్యామ్‌కు నీటిని మళ్లించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. దీనిపై తుది నిర్ణయం కోసం ఆర్థిక కమిషన్‌కు పంపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే అఫ్గనిస్థాన్ నంగర్‌హార్ ప్రావిన్సుల్లో వ్యవసాయ భూములకు నీటి కొరత తీరుతుంది. అయితే, ఇది పాకిస్థాన్‌కు మాత్రం శరాఘాతమే అవుతుంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉంది. సుమారు 500 కిలోమీటర్లు ప్రవహించే కునార్ నది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని చిత్రాల్ జిల్లాలో హిందూ కుష్ పర్వతాల నుంచి మొదలవుతుంది. అక్కడి నుంచి అఫ్గన్‌లోకి ప్రవహించి, కునార్, నంగర్‌హార్ ప్రావిన్సుల గుండా ప్రవహించి కాబూల్ నదిలో కలుస్తుంది. అనంతరం పెచ్ నది నీటితో కలిసి తూర్పుగా తిరిగి పాక్‌లోకి ప్రవేశించి, పంజాబ్ ప్రావిన్సుల్లోని అట్టాక్ నగరం సమీపంలో సింధు నదికి చేరుతుంది. కాగా, ఇప్పటికే అఫ్గన్ ప్రాజెక్ట్‌కు భారత్ మద్దతు ప్రకటించింది. పాక్‌లోని ప్రవహించే అతిపెద్ద నదులలో ఇది ఒకటి. సింధు నది మాదిరి ఇది కూడా వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమైన వనరు. ముఖ్యంగా సరిహద్దు హింసకు కేంద్రంగా ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతానికి ఇది చాలా కీలకం. కునార్ నది పాక్‌లోకి తిరిగి ప్రవేశించే ముందు దానిపై ఆనకట్టలు నిర్మిస్తే, పాకిస్థాన్‌లో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ప్రాజెక్టులకు నీటి లభ్యత తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే భారత్ సింధు జలాలను పరిమితం చేయడంతో ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. భారత్‌తో సింధు జల ఒప్పందం ఉన్నట్టు ఇస్లామాబాద్‌కు కాబూల్‌తో నీటి పంపకాలపై ఎటువంటి ఒప్పందాలు లేవు. దీనివల్ల తాలిబన్లను ఆపడానికి తక్షణ మార్గం లేదు. ఇది పాకిస్థాన్అఫ్గన్ మధ్య మరింత ఉద్రిక్తతలను పెంచే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఇరు దేశాలూ సరిహద్దుల్లో సై అంటే సై అంటున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఉద్రిక్తతలు క్రమంగా పెరిగి.. అక్టోబరు నుంచి తారాస్థాయికి చేరుకున్నాయి. ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్సుల్లో తెహ్రిక్ తాలిబన్ పాకిస్థాన్ మిలీషియా గ్రూప్, పాక్ సైన్యం మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే సొంత పౌరులపైనే పాక్ సైన్యం వైమానిక దాడులు చేపట్టింది. దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎలాన్ మస్క్.. సంపదలో సాటెవ్వరు

ఎలాన్ మస్క్ సంపాదనలో తన రికార్డ్ లను తానే బ్రేక్ చేసుకుంటున్నాడు. ఇతని నికర విలువ 600 బిలియన్ డాలర్లకు చేరింది. 2020 మార్చి నాటికి 24.6 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆయన ఆస్తులు.. ఐదేళ్లలోనే 600 బిలియన్ డాలర్లకు చేరింది. ఇంతలా ఇప్పటి వరకు ఏ కుబేరుడూ సంపాదించలేదు అంటే అతిశయోక్తి కాదేమో. ఎలాన్ తర్వాత ఒరాకిల్ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ గతంలో ఓసారి 400 బిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకున్నారు. అది కూడ ఒక్కరోజే నిలిచింది. ఇక స్పేస్ ఎక్స్ లో మస్క్ కు 42 శాతం వాటా ఉంది. ఈ కంపెనీ వచ్చే ఏడాది ఐపీఓకు వెళ్ళనుంది. ఇది మొదట్లో 400 బిలియన్ డాలర్ల విలువతో ఐపీఓకు వెళుతుందని చెప్పారు. కానీ ఇప్పుడు ఏకంగా 800 బిలయన్ డాలర్లకు వెళ్ళనున్నట్టు తెలుస్తోంది. దీని కారణంగా ఎలాన్ సంపద విలువ ఒక్కసారే అమాంతంగా పెరిగిపోయింది.

ఇక టెస్లా విషయానికి వస్తే..టెస్లా వాటాదారులకు ప్రకటించిన ప్యాకేజీలతో ఎలాన్ మస్క్ ట్రిలియనీర్ గా మారనున్నాడు. కొన్ని రోజుల క్రితం టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో కంపెనీ వాటాదారులకు ప్యాకేజీలను అనౌన్స్ చేశారు. ఇందులో మస్క్ కు ఏడాదికి ఒక ట్రిలియన్ డబ్బులు అందనున్నాయి. కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశంలో 75% కంటే ఎక్కువ షేర్లు పే ప్యాకేజీకి అనుకూలంగా ఓటు వేశాయని టెస్లా ప్రకటించింది. మస్క్ కంపెనీలో 15శాతం వాటాను కలిగి ఉన్నారు. అది ఇప్పుడు 25 శాతానికి పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. అలా అయితే ఆయన వేతనం రోజుకు 237 మిలియన్ డాలర్లకు చేరుతుంది.



